ముందుకుసాగని పనులు

గుర్రపుడెక్క, మురుగునీటితో నిండిన చెరువు ● సుందరీకరణ చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి





బీకే ఎన్‌క్లేవ్ మీదికుంట చెరువులో పెరిగిన గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు

మియాపూర్: చెరువుల సుందరీకరణ పనులు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సుందరీకరణ పనులు చేపట్టగా.. కొంతమేర పనులు జరిగి మరలా నిలిచిపోవడంతో చెరువులు ప్రస్తుతం పిచ్చి మొక్కలు, గుర్రపుడెక్కతో నిండటమే కాకుండా కబ్జాలకు గురవుతున్నాయి. చెరువుల సుందరీకరణతో పాటు తాగునీటి చెరువులుగా మారుస్తామని చెప్పిన ప్రజాప్రతినిధులు, అధికారుల మాటలు నీటిమీద రాతలుగా మిగిలిపోతున్నాయి.



శిలాఫలకం

ఎక్కడి గొంగడి అక్కడే..

కోట్లాది రూపాయల నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా.. చెరువుల సుందరీకరణ పనులు మాత్రం ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారాయి. పలు కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు చెరువులకు పూర్వవైభవం తీసుకొస్తామని ప్రకటనలు ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు.

◆ మియాపూర్‌లోని బికే ఎన్‌క్లేవ్ మీదికుంట చెరువు సుందరీకరణ పనులకు రూ. కోటి 70 లక్షల నిధులు కేటాయించి ఆ పనులకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అధికారులతో కలిసి 2022 ఏప్రిల్ 30న సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు.

◆ శంకుస్థాపన చేసిన తర్వాత కొన్ని రోజుల పాటు చెరువు చుట్టూ.. వ్యర్థాలను తొలగించి కొంతమేర మట్టిని చెరువు కట్టగా వేశారు. ఇది చూసిన స్థానికులు త్వరలో చెరువు ఆహ్లాద వాతావరణం అందుబాటులోకి వస్తుందనుకున్న వారి ఆశలు అడియాశలయ్యాయి. పదిరోజుల పాటు పనులు చేపట్టి మధ్యలోనే వదిలేశారని ప్రజలు వాపోతున్నారు.

◆ చుట్టుప్రక్కల కాలనీల నుంచి మురుగు చెరువులో చేరుతూ.. దుర్గంధం వెదజల్లుతోంది. దీనితో పాటు చెరువులో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తోంది.

కబ్జాలో చెరువు..

◆ మీదికుంట చెరువు గతంలో విస్తీర్ణానికి ప్రస్తుతం చెరువు సుందరీకరణపనులు చేపట్టిన విస్తీర్ణానికి చాలా వ్యత్యాసం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

◆ చెరువును సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేసి కబ్జాలను తొలగించి సుందరీకరణ పనులను చేపట్టాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

◆ నామమాత్రంగా సర్వేలు చేపట్టి కబ్జాలు తొలగించకుండా చుట్టూ కొంతమేర చెరువు కట్టవేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

◆ చెరువు స్థలాన్ని కబ్జాచేసిన అధికారులు పట్టించుకోకుండా వాటిని తొలగించకుండా సుందరీకరణ పనులు చేపట్టడంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

◆ చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసి రెండేళ్లు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగకపోవడంతో నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలున్నాయి.

◆ రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి చెరువులను తిరిగి సర్వే చేయించి కబ్జాల నుంచి చెరువు స్థలాన్ని కాపాడాలన్నారు. సుందరీకరణ పనులను కూడా త్వరితగతిన పూర్తిచేసేలా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్‌సీయూ డిపోకు రెండో స్థానం

రాములోరి తలంబ్రాల బుకింగ్‌లో గుర్తింపు



హెచ్‌సీయూ డిపో మార్కెటింగ్ విభాగం బృందాన్ని సత్కరించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు

రాయదుర్గం: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో సీతారాముల కల్యాణం సందర్భంగా తలంబ్రాల ప్యాకెట్లను బుకింగ్ చేయడంలో ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపోకు రెండోస్థానం లభించింది. దీంతో హెచ్‌సీయూ డిపో మార్కెటింగ్ విభాగం అధికారుల బృందాన్ని ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించి బహుమతిని అందించారు. ఆర్టీసీ జెడ్‌ఎస్టీసీ డైరెక్టర్ అపర్ణాకళ్యాణి, జీహెచ్‌జెడ్ సీటీఎం మధుసూదన్, ఇతర ఉన్నతాధికారులు కలిసి హెచ్‌సీయూ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ విజేందర్‌రెడ్డి, బృందాన్ని సత్కరించి బహుమతిని అందజేశారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ప్రజల నుంచి తలంబ్రాల ప్యాకెట్ల కోసం బుకింగ్ చేసుకోవాలని కోరగా 1100 మంది బుకింగ్ చేసుకోగా.. తలంబ్రాల ప్యాకెట్లను ఇప్పటకే చాలా మందికి ఇంటింటికి తీసుకెళ్లి అందించారు. మిగిలిన వాటిని మరోవారం రోజుల్లో అందించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో రెండోస్థానం పొందడంపై హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి మార్కెటింగ్ విభాగాన్ని అభినందించారు. వచ్చే ఏడాది మొదటి స్థానం పొందాలని సూచించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

మాదాపూర్: కళాకారులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మేధా కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించింది. వందే ఉమసుతం, జయదేవ అష్టపది, మండూకశబ్దం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. మాయ డ్యాన్స్ అకాడమీ భావన గౌరీశిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. నటేశకౌతం, ఓంగ్రీమ్, ఝూన్సీకి రాణి, విషమకార కణ్ణన్, తిల్లాన అంశాలను కళాకారులు రుహణీ, ఐర, భావన, సౌరబ్, అనన్య, విపిన్, అలంకృత, డోయల్ తదితరులు పాల్గొని ప్రదర్శించారు. ప్రముఖ నాట్య కళాకారిణి పూజిత కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై కళాకారులను అభినందించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వరార్చనలో భాగంగా శనివారం నటరాజ నృత్యానికేతన్ శిష్యులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. వినాయకశబ్దం, అలరులు కురియగా, జగడపు చనువుల జాతర, చక్కని తల్లికి చాంగుభళా, ఒకపరికొకపరి, కొండలలో నెలకొన్న లాంటి సంకీర్తనలను నృత్యరూపంలో ప్రదర్శించి అలరించారు. కళాకారులు శాన్వి, శ్యామ్, సాయివైష్వి, శ్రీయాన్వి, కృతికవర్మ, ధృతి, రియాన్షి, తన్విత, భవిష్య తదితరులు పాల్గొని ప్రదర్శన చేశారు.



అన్నమయ్యపురంలో కూచిపూడి నృత్యప్రదర్శన



శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనంగా 'ది కర్టెన్ స్టోరీ' ప్రారంభోత్సవం



గచ్చిబౌలిలో కర్టెన్ స్టోర్‌లో సందడి చేసిన మోడళ్లు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ఎల్లప్పుడూ సంప్రదాయం, ఆధునికత సమ్మేళనం. ప్రస్తుతం అది విలాసవంతమైన శైలీ కేంద్రంగా మారింది. ఈ నేపథ్యంలో కొత్త ఫర్నిషింగ్స్ బ్రాండ్ 'ది కర్టెన్ స్టోరీ' నగర మార్కెట్‌లోకి వచ్చిందని నిర్వాహకులు సాహిబా వాధ్యాశర్మ, మయాంక్ శర్మ తెలిపారు. శుక్రవారం రాత్రి గచ్చిబౌలిలోని టెలిఫోన్‌నగర్‌లో పలువురు మోడళ్లు సందడి చేశారు. హైదరాబాద్ డిజైన్ ల్యాండ్‌స్కేప్‌లో ఒక మూల స్తంభంగా మారనుందన్నారు. ఇంటీరియల్ డిజైన్‌ల బృందం రూపొందించిన క్యూరేటెడ్, థీమ్ అధారిత సేకరణలో 'ది కర్టెన్' ప్రత్యేకమైందన్నారు. ఇది దేశంలోనే కాకుండా టర్కీలోని అగ్రశ్రేణి ఫ్యాబ్రిక్ తయారీదారులతో ప్రత్యేక భాగస్వామ్యంతో నాణ్యత ప్రమాణాలకు కట్టుబడి ఉందన్నారు.

భగవద్గీత ఎంతో పవిత్రమైన గ్రంథం

హరేరామ హరేకృష్ణ సంస్థ ప్రతినిధులు

మోతీనగర్: భగవద్గీత విన్నా.. చదివినా ఎంతో పుణ్యం లభిస్తుందని హరేరామ హరేకృష్ణ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం మూసాపేట డివిజన్ అవంతినగర్‌తోట షిరిడీ సాయిబాబా దేవాలయ ఆవరణలోని ధ్యాన మందిరంలో భగవద్గీత గురించి వివరించారు. భగవద్గీత ఎంతో పవిత్రమైన గ్రంథమని తెలిపారు. దానిని ప్రతి ఇంట్లో పూజగదిలో పెట్టాలన్నారు. ప్రతిరోజు కనీసం ఒక్క పేజీనైనా చదవాలని సూచించారు. చదవలేని వారు ఆడియో, వీడియోల్లో అయినా వినాలని కోరారు.



'బ్లమ్ కిచెన్' ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం



బ్లమ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నదీమ్ పట్నీ తదితరులు



గచ్చిబౌలిలో బ్లమ్ కిచెన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

గచ్చిబౌలి: బ్లమ్ ఇండియా కిచెన్, ఫర్నిచర్ ఫిట్టింగ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను గచ్చిబౌలిలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నదీమ్ పట్నీ సేల్స్ డైరెక్టర్ సమీర్ మోహన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నదీమ్ మాట్లాడుతూ.. స్పేస్ ఇంటీరియర్స్ ఇండియా సహకారంతో దీనిని ప్రారంభించామన్నారు. ప్రపంచ స్థాయి మేడ్ ఇన్ ఆస్ట్రియా ఫర్నిచర్ ఫిట్టింగ్‌లను బ్లమ్ ఇండియా అందిస్తుందన్నారు. ఒకసారి కొనుగోలు చేసిన కిచెన్ 20 ఏళ్ల పాటు ఉంటుందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా 'ఏజ్ ఎక్స్‌ప్లోరర్ సూట్' ను అందిస్తామని వివరించారు. ఈ సెంటర్‌లో కిచెన్, ఫర్నిచర్ విడి భాగాలను తాకి వాటి పనితీరును తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. బ్లమ్ ఇండియా స్పేస్ ఇంటీరియర్ డైరెక్టర్ శేఖర్ రాజు తదితరులున్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



రాయదుర్గంలో కరపత్రాలను పంపిణీ చేస్తూ..

రాయదుర్గం: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయదుర్గంలో బీజేపీ జిల్లా కార్యదర్శి అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి పార్టీ కరపత్రాలను అందించి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలో బీజేపీకి తిరుగులేదని, ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ మెజార్టీ సాధిస్తుందన్నారు. బీజేపీ నాయకులు శ్యామ్‌లేట్‌సంజీవ, శ్రీశైలం, సతీష్‌గౌడ్, చిత్తారి, రవిరాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఆర్యవైశ్య సంఘం మద్దతు..

మియాపూర్: కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మియాపూర్‌లోని హోటల్ మిలినియం గ్రాండ్‌లో నియోజకవర్గ ఆర్య వైశ్య ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నేతలు రవికుమార్‌యాదవ్‌లతో కలిసి ఆమె మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మే 13న భారీగా కదలి వచ్చి బీజేపీకి ఓటువేయాలని పిలుపునిచ్చారు. ఆర్య వైశ్యులందరూ.. కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అండగా ఉండాలని ఆమె కోరారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య సంఘం సమ్మేళనంలో కొండా సంగీతారెడ్డి

ఘనంగా ప్రపంచ నర్సుల దినోత్సవం

ఆల్విన్‌కాలనీ: రాందేవ్‌రావ్ ఆస్పత్రిలో ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని శనివారం 'అవర్ నర్స్ అవర్ ఫ్యూచర్'కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్ష్మీకమలాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. నర్సులందరూ మదర్ థెరిస్సా, నైటింగేల్, సిస్టర్ నిర్మలను ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని మెడికల్ డైరెక్టర్ డా. కమలాకర్ అన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత నర్సులు సిస్టర్స్ దైవకుమారి, రూహెల్, సుజావతి, హెలెన్ మేరీ ప్రశాంతిలను ఈ సందర్భంగా సన్మానించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ ప్లెడ్జ్‌ను రాందేవ్ ఎన్‌ఎస్, మేరీ డేవిడ్ పి. శోభరాణిలతో విజయవంతంగా చేయించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి నర్సులను, శివానంద రిహాబిలిటేషన్ నర్సులను, కుముదిని దేవి నర్సింగ్ కాలేజ్ సిబ్బందిని, విద్యార్థినులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఆస్పత్రి వైద్యులు, స్పెషల్ డాక్టర్లు, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఆస్పత్రి సీఈవో యోబు తెలిపారు.

చేవెళ్లలో బీఆర్‌ఎస్ విజయం ఖాయం

- ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ
- జోరుగా బీఆర్‌ఎస్ శ్రేణుల బైక్ ర్యాలీలు



బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ రామాలయం నుంచి బైక్‌ర్యాలీని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ఈ ర్యాలీ రామాలయం నుంచి రాజీవ్ గృహకల్ప, పాపిరెడ్డి కాలనీ, నెహ్రూనగర్, గోపీనగర్, మసీద్‌బండ మీదుగా డివిజన్‌లోని అన్ని కాలనీల్లో కొనసాగింది. మాజీ సీఎం కేసీఆర్ సంక్షేమ పాలనలో జరిగిన అభివద్ధిని చూసి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌కు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు.

గచ్చిబౌలిలో బీఆర్‌ఎస్ బైక్ ర్యాలీ..

రాయదుర్గం: పార్లమెంటు ఎన్నికల ప్రచారం చివరి రోజైన శనివారం గచ్చిబౌలి డివిజన్‌లో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. రాయదుర్గంలోని ప్రధాన రోడ్డుపై ప్రారంభమైన ఈ బైక్‌ర్యాలీ టెలికామ్‌నగర్, గచ్చిబౌలి, జీపీఆర్‌ఏ క్వార్టర్స్, గుల్‌మోహర్‌పార్కు, నల్లగండ్ల, గోపన్‌పల్లి, ఎన్టీఆర్‌కాలనీ, గౌలిదొడ్డి, నానక్‌రామ్‌గూడ మీదుగా ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం వరకు కొనసాగింది. సాయిబాబా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్లలో మరోసారి ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, వార్డు, ఏరియా కమిటీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం..

రాయదుర్గం: చేవెళ్లలో భారీ మెజార్టీతో గెలిచి గులాబీ జెండా ఎగురవేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ధీమా వ్యక్తం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఎన్టీఆర్‌కాలనీ, గోపన్‌పల్లి, తాజ్‌నగర్‌లో శుక్రవారం రాత్రి బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారాన్ని మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి చేవెళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ గెలువడం ఆనవాయితీగా వస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజల్లో అప్పుడే వ్యతిరేకత వచ్చిందని, బీజేపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్క గ్యారంటీ అమలు చేయలేదని ఆయన విమర్శించారు. మోసం చేసే పార్టీ కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలకు అండగా ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేసే పార్టీకి అవకాశం కల్పించాలని కోరారు.

హఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్‌లలో..

హఫీజ్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చివరిరోజైన శనివారం హఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్‌లలో బీఆర్‌ఎస్ పార్టీ బైక్‌ర్యాలీలు జోరుగా జరిగాయి. ఈ బైక్ ర్యాలీలను కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, గౌతమ్‌గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటువేసి ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చేవెళ్ల గడ్డపై ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. కేసీఆర్ పేద, మధ్యతరగతి వారికి అందించిన సంక్షేమ పథకాలు, హైదరాబాద్ నగరాభివృద్ధి పెట్టుబడులు, నిరంతర విద్యుత్, రైతుబంధు, బీమా, ఆసరా పెన్షన్లు బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తాయన్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని బైక్‌ర్యాలీ చేపట్టారు. ఇప్పటి వరకు రెండుసార్లు అవకాశం ఇచ్చిన వారు మరో పార్టీలోకి వెళ్లి పోటీపడుతున్నారన్నారు. వారిద్దరినీ ఓడించి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గ్యారంటీలని మోసం చేస్తున్నారని ఆరోపించారు.



గచ్చిబౌలిలో మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఆధ్వర్యంలో..



మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

వైభవంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

తులసి దళాలతో దేవతా మూర్తులకు అభిషేకం



ప్రత్యేక అలంకరణలో గణపయ్య



కాశీవిశ్వేశ్వరస్వామి



ఆంజనేయస్వామి

రాయదుర్గం: అర్చకుల మంత్రోచ్చరణల మధ్య చండీహోమం, రుద్రహోమం ,గణపతిహోమం, పురుషసూక్త, శ్రీసూక్త, ఆరోగ్య ఆయుషాభివృద్ధికి ధన్వంతరి, మూలమంత్ర హోమాలను వైభవంగా జరిగాయి.గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజైన శనివారం ఉదయం ఆలయంలో కాశీవిశ్వేశ్వరస్వామి వారికి మల్లెపూలు, బిల్వాలు, ధన్వంతరి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీసాయిబాబా, ఇతర దేవతా మూర్తులకు సహస్రనామాలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు.

కల్యాణ మహోత్సవాలు..

శివసాయిక్షేత్రంలో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఆంజనేయస్వామివారికి నాగవల్లి దళాలతో సహస్రనామార్చాన జరిగింది. అనంతరం శివపార్వతుల కల్యాణం , వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణం ఒకే వేదికపై నిర్వహించడం విశేషం.

ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

హఫీజ్‌పేట్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లి ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ 6వ నెంబర్ ఫ్లాట్‌ఫారం వైపు ఉన్న ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి (55) శనివారం పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. అప్పటికే అతడు మృతి చెందాడు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడు యాచకుడని, బహుశా అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మలకు వందనం



దివ్యాంగుల తల్లులను సన్మానిస్తున్న అధికారి లలిత కుమారి

పటాన్‌చెరు టౌన్: మండల పరిధి ఇస్నాపూర్‌లో శనివారం నిర్వహించిన మదర్స్ డే వేడుకల్లో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన బిడ్డలకు సేవ చేస్తున్న 20 మంది మాతృమూర్తులను సన్మానించి చీరలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వపరంగా ఎలాంటి సహాయమైనా అందించడానికి తాను ముందుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, డీఎండీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సంతోషమ్మ, శిరీష, ఏపీఎం శ్రీనివాస్, సామాజిక కార్యకర్త బాపు వెంకన్న, యువ చైతన్య ఇస్నాపూర్ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కంచిగారి మహేష్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కదనోత్సాహం



పటాన్‌చెరు / పటాన్‌చెరు టౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారం చివరి రోజు సీఎం రేవంత్‌రెడ్డి పటాన్‌చెరులో పర్యటించారు. మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా శనివారం పట్టణంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనం భారీగా తరలివచ్చారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి పటాన్‌చెరుకు విచ్చేసిన సీఎం రేవంత్‌కు జనం నీరాజనం పలికారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి రింగ్‌రోడ్ వద్ద ముఖ్యమంత్రికి మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌లు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి ర్యాలీగా పటాన్‌చెరు అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ రోడ్‌షోలో రేవంత్ రెడ్డి 23 నిమిషాలు మాట్లాడారు. సీఎం ప్రసంగంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ఎస్పీ రూపేష్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ ప్రవీణ్ రెడ్డి నేతృత్వంలో భారీ బందోబస్తు చేపట్టారు.

కాటాను ఎమ్మెల్యేగానే చూస్తాం.. : సీఎం రేవంత్

సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో కాటా శ్రీనివాస్ గౌడ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాటను గెలిపించి ఉంటే ఈ ప్రాంతంలో నిధుల వరద పారేదని చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపిస్తే చట్టసభల్లో ఈ ప్రాంత సమస్యను వివరించే అవకాశం ఉంటుందని రేవంత్ చెప్పారు. ఎంపీగా మధును గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తానని రేవంత్ చెప్పారు. తన దృష్టిలో కాట శ్రీనివాస్ గౌడ్ కూడా ఎమ్మెల్యేనని రేవంత్ చమత్కరించారు.

సంగారెడ్డి కింగ్ జగ్గన్న...

జగ్గారెడ్డి సంగారెడ్డి కింగ్ అని సీఎం రేవంత్ సంబోధించారు. సీఎం ప్రసంగం కొనసాగుతుండగా జగ్గారెడ్డి వాహన టాప్‌పైకి ఎక్కారు. ఆ సందర్భంలో సంగారెడ్డి కింగ్ జగ్గారెడ్డి అంటూ సీఎం అనడంతో కార్యకర్తలు పెద్ద ఎత్తున హోరెత్తారు.

నీలం మధుకు న్యాయవాదుల మద్దతు..

మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని న్యాయవాదులు పిలుపునిచ్చారు. ప్రముఖ న్యాయవాది తూము శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెల్లాపూర్‌లో నీలం మధుకు మద్దతుగా శనివారం న్యాయవాదుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధుకు సంపూర్ణ మద్దతునిస్తూ గెలుపు కోసం కృషి చేస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ లీగల్ సెల్ కోఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి, టీపీసీసీ వైస్‌చైర్మన్లు చిన్నారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శశికాంత్, టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, సంగారెడ్డి లీగల్ సెల్, పార్లమెంట్ పరిశీలకులు శ్రీధర్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.